క్లుప్తంగా

26న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఈనెల 26న వెన్నెలపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవిశంకర్, సీహెచ్.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బి.అన్నాజీరావు తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో అర్హత సాధించిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారని వారు తెలిపారు. వివరాల కోసం 97016 58665, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా కల్వర్టు


ప్రమాదకరంగా మారిన కల్వర్టు

పరవాడ: పి.బోనంగి గ్రామం రామాలయం వీధిలోని కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కల్వర్టు పై పలక విరిగిపోవడంతో రాత్రివేళల్లో చాలామంది కాలువలో పడిపోతున్నారు. వృద్ధులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టుపై పైమూత ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు అనేక సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధికాలువపై మూత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు అదీప్‌రాజ్ పరామర్శ


త్రినాథ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేసుబోయిన త్రినాథ్‌ను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. త్రినాథ్‌ను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడచీపురుపల్లి పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ అవార్డు


కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ కనకప్పారావు

పరవాడ: వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ నాణ్యత ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్) అవార్డు లభించింది. రెండేళ్ల క్రితం జాతీయ నాణ్యత ప్రమాణాల ప్రతినిధుల బృందం ఆస్పత్రిని సందర్శించి, సదుపాయాలను పరిశీలించి వెళ్లింది. ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో ఆస్పత్రికి అవార్డు లభించింది. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ఆస్పత్రి వైద్యాధికారి వి.కనకప్పారావు సోమవారం అవార్డును అందుకున్నారు.

సత్యదేవుని సన్నిధిలో పౌర్ణమి పూజలు


పూజలందుకున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు.

సోలార్ వెలుగులపై నిర్లక్ష్యపు నీడ


ముత్యాలమ్మపాలెం తీరంలో మాయమైన సోలార్ లైట్ల ఐరన్ పైపులు (ఫైల్)

- తుప్పు పట్టిన ఇనుప పైపులు, సోలార్ ప్లేట్లు
- లక్షల రూపాయల మెటీరియల్ దొంగలపాలు
- పర్యవేక్షణ లోపమే కారణమని ఆరోపణలు
- తీరప్రాంతాల్లో అలముకున్న అంధకారం

పరవాడ: తీరప్రాంతాల్లో వెలుగులు చిమ్మిన సోలార్ లైట్లపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో లక్షలాది రూపాయలను వెచ్చించి నిర్మించిన సోలార్ లైట్లను బిగించిన పైపులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో మత్స్యకార్మికులు, పర్యాటకుల సౌకర్యార్థం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఏడేళ్ల క్రితం లక్షల రూపాయల ఖర్చుతో సోలార్ లైట్లు సమకూర్చింది. ముత్యాలమ్మపాలెం తీరంలో 80 సోలార్ లైట్లు, తిక్కవానిపాలెం తీరంలో 80 సోలార్ లైట్లను ఏర్పాటు చేసింది. ఈ సోలార్ లైట్ల వెలుగులో తీరప్రాంతాలు చూడముచ్చటగా కనిపించేవి. తీర ప్రాంతాల సందర్శనకు వచ్చే పర్యాటకులకూ మంచి అనుభూతిని కనిపించేవి. అలాగే రాత్రివేళ చేపల వేటకు వెళ్లే మత్స్యకార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అయితే, ఆ వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. తీరం వెంబడి ఐరన్ పైపులు ఏర్పాటు చేసి, వాటికి సోలార్ లైట్లను అమర్చారు. అయితే తీరంలో ఉప్పు గాలి ప్రభావంతో ఇనుప పైపులతో పాటు సోలార్ ప్లేట్, లైట్లు కూడా తుప్పు పట్టి రాలిపోయాయి. మరి కొన్ని పైపులకు అమర్చిన మెటీరియల్ రాలిపోయింది. ఇసుక కోతకు గురికావడంతో పలు చోట్ల కాంక్రీట్ దిమ్మలు నేలకు ఒరిగితే స్థానికులు పట్టుకుపోయారు.

ఐరన్‌పైపులు మాయం

తిక్కవానిపాలెం తీరంలో నిన్న మొన్నటి వరకు తీరం పొడవునా ఉన్న ఐరన్ పైపులు ఉన్నట్టుండి ఒకే సారి మాయం కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తీరం పొడవునా ఉన్న ఐరన్ పైపులను కోసి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ప్రస్తుతం అక్కడ ఒక్క ఐరన్ పైపు కూడా లేదు. అంతకుముందు ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు అమర్చిన ఐరన్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. మాధవస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన మరికొన్ని సోలార్‌లైట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. సోలార్ లైట్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోవడానికి పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. బాధ్యులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని అలాగే తీరంలో మళ్లీ వెలుగులు ప్రసరించేలా చూడాలని కోరుతున్నారు.


ముత్యాలమ్మపాలెం తీరంలో వెలగని సోలార్ లైట్లు


ఐరన్ పైపులను కట్ చేసి దొంగిలించుకుపోవడంతో మిగిలిన కాంక్రీట్ దిమ్మ

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- అపార్ట్‌మెంట్‌లలో సీసీ కెమెరాలు తప్పనిసరి
- వెస్ట్‌జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు


మహిళలకు సూచనలిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు

పెందుర్తి: నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలు–నియంత్రణపై పెందుర్తి సమీపంలోని దొగ్గవానిపాలెం ప్రాంతంలో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఇల్లు విడిచి ఎక్కువ రోజుల పాటు ప్రయాణాలకు వెళ్తే, ముందుగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే తగిన గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతీ ఇంటికి, అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్రైం విభాగం ఇన్‌చార్జి ఎస్ఐ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణల తొలగింపునకు వినతి


డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇరువాడ గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామంలో గెడ్డవాగు ఆక్రమణలపై గ్రామస్తులు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆక్రమణల కారణంగా మూడు చెరువులకు నీటి వనరులు లేక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్‌కు ఇరువాడ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 103, 106లలో ఒక రియల్టర్ గెడ్డవాగును ఆక్రమించుకోవడం వలన గ్రామంలోని 3 ప్రధాన చెరువులైన బుట్టుపాత్రునివాని చెరువు, గైరమ్మ చెరువు, రాజు చెరువులకు నీరు చేరడం లేదని తెలిపారు. దీంతో వరినాట్లు వేసుకునేందుకు నీరు లేకపోవడంతో ఆయకట్టు రైతులు డీజిల్ ఇంజిన్లు, పెట్రోల్ ఇంజిన్ల ద్వారా నీరు తోడుకోవలసి వస్తోందన్నారు. ఈ కారణంగా ప్రతీ రైతు రూ.5వేల నుంచి 10 వేలు వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని తెలియజేశారు. సర్వే నంబర్ 103, 106లలోని ఆక్రమణలను తొలగించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, గ్రామ పెద్దలు బలిరెడ్డి కనకరాజు, బలిరెడ్డి అప్పారావు, బలిరెడ్డి సూర్యప్రసాద్, రేసుపూడి రమణ, సంద్రాన అప్పారావు, దాడి సత్తిబాబు, పోట్ల కృష్ణ, బలిరెడ్డి సురేష్ తదితరులున్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం


దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలిలో తారురోడ్డు వేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలిలో అధ్వానంగా మారిన గుంతల రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి ఇక్కడ గుంతల రహదారిని ఆదివారం తారు రోడ్డుగా తీర్చిదిద్దారు. 'గుంతలను పూడ్చాలి' శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి, తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి బీటి నిర్మాణానికి చర్యలు తీసుకున్న అధికారులను గ్రామస్తులు అభినందించారు.

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణం


తలంబ్రాల ఘట్టం జరిపిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస హోమం, సుదర్శన హోమం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా పౌర్ణమి తిరువీధి


తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గ్రామ తిరువీధి ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో కొలువుదీర్చి, సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో వైభవంగా తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు పవన్‌కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు


పూర్ణాహుతి సమర్పిస్తున్న వేద పండితులు

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో హోమగుండాన్ని ఏర్పాటు చేసి, వేదికపై సుదర్శన పెరుమాళ్లను కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కుంభప్రోక్షి కార్యక్రమాన్ని జరిపారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు భార్గవ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


వృద్ధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పెందుర్తి ఫొటో గ్రాఫర్లు

పెందుర్తి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. వృద్ధులతో కలిసి కేక్ కట్ చేశారు. వారికి పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చక్రవర్తి

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. సబ్బవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎస్.చక్రవర్తి సోమవారం పాఠశాలను సందర్శించి, ఈ పరీక్షలు నిర్వహించారు. దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండే చోట దోమలు పెరుగుతాయని, అందువల్ల నీటి నిల్వలు లేకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కన్నంనాయుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత, ఎంపీహెచ్ఈవో జేసుదాసు, పీహెచ్ఎన్ రత్నాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ రాంబాబు, ఏఎన్ఎం అనురాధ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒడియా భాషలో 'సింహాచలం క్షేత్రమహత్యం'

పునః ప్రచురణ పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఒడిశా భక్తుల సౌకర్యార్థం ఒడియభాషలో పునః ప్రచురించిన సింహాచల క్షేత్రమహత్యం పుస్తకాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సోమవారం ఆవిష్కరించారు. దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. 1952లో నగరంలోని ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన తిరుమల నరసింహాచార్యులు సింహాచల క్షేత్రమహత్యం పుస్తకాన్ని తెలుగులో ప్రచురించి, దేవస్థానానికి అందజేశారు. ఆ పుస్తకాన్ని అప్పట్లోనే ఒడియా భాషలోనూ ప్రచురించారు. ఆ పుస్తకాలు కనుమరుగవడంతో 1985లో దేవస్థానం అప్పటి ఈవో ఎస్.చిట్టిబాబు వాటిని వెలుగులోకి తీసుకొచ్చి, మళ్లీ ప్రచురింపజేశారు. ఒడిశా భక్తులకు వాటిని అందించేందుకు ఒడిశాకు చెందిన అన్నపూర్ణ పాండే పునఃప్రచురించారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అలమేలు మంగకు కలశాభిషేకం


అలమేలు మంగమ్మకు అభిషేకం చేస్తున్న అర్చకులు, కలశాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

పెందుర్తి: శ్రావణ పూర్ణిమను పురస్కరించుకుని చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో అలమేలు మంగమ్మ దేవాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశాలతో భక్తులు ఊరేగింపు చేశారు. కలశాల్లోని జలాలతో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు కలశాల ఊరేగింపులో పాల్గొన్నారు.

ఎగసిన నిరసన జ్వాల


సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడిన నర్సింగ్ విద్యార్థులు

కోల్‌కతాలో మెడికో హత్యాచారంపై పెల్లుబికిన ఆగ్రహం


పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థులు


వేపగుంటలో నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు


ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

పెందుర్తి: కోల్‌కతాలో విధి నిర్వహణలో ఉన్న మెడికోపై జరిగిన హత్యాచారం ఘటనపై పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిరసన తెలిపారు. బాధితురాలికి ఘన నివాళి అర్పించారు. కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఘటనను ఖండిస్తూ బాధితురాలికి సంఘీభావంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు కొవ్వొత్తులతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ కోశాధికారి ఎస్.వి. రమణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండే వైద్యులు, సిబ్బందికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యుల కోసం జాతీయ స్థాయిలో రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.నాగమణి, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ బి.సౌజన్య, ట్రైనర్ మంజుల పాల్గొన్నారు.

వేపగుంటలో..

మెడికో హత్యాచారానికి నిరసనగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాల మేరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేపగుంట కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికోపై హత్యాచారానికి పాల్పడిన క్రూర మృగాల్లాంటి వ్యక్తులను అత్యంత కఠినంగా శిక్షించాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థుల భారీ ర్యాలీ

సబ్బవరం: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనపై సబ్బవరంలోని నైటింగేల్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వసుంధర, ఏవో మౌనిక మాట్లాడుతూ దేశంలో రోజురోజుకీ మహిళలపై విపరీతంగా అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. కోల్‌కతా ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేష్, నర్సింగ్ ఆఫీసర్ తేజ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 9 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 9 వినతులు అందాయి. 97వ వార్డు సుజాతనగర్‌లో పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించాలని, 97వ వార్డు శ్రీలక్ష్మీనగర్‌లో, వెంకటాద్రినగర్‌లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని, 92వ వార్డు వెంకటాపురంలో చెట్లు తొలగించాలని, 97వ వార్డు వెంకటాద్రినగర్‌లో హైమాస్ట్ దీపం ఏర్పాటు చేయాలని, 97వ వార్డు వెంకటాద్రి నగర్‌లో కాలువ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వినతులు ఇచ్చారు. అలాగే 95వ వార్డు చినముషిడివాడ సర్వే నెంబర్ 110లో మంజూరు చేసిన తప్పుడు ప్లాన్‌ను రద్దు చేయాలని, 97వ వార్డు పులగానిపాలెంలో పబ్లిక్ రోడ్డు ఆక్రమణను, 96వ వార్డు మరిడిమాంబ గుడి సమీపంలో 40 అడుగుల రోడ్డు ఆక్రమణను నియంత్రించాలని జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించిన జెడ్సీ సంబంధిత అధికారులకు వాటిని అందించి, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.